కోతల ప్రభుత్వం

- దివ్యాంగుల పింఛన్ల కోతకు సిద్ధమైన కూటమి ప్రభుత్వం
- నియోజకవర్గంలో 811మంది దివ్యాంగులకు నోటీసులు
- ఆందోళనలో దివ్యాంగులు



నూజివీడు ఎంపీడీఓ కార్యాలయం వద్దకు వచ్చిన దివ్యాంగులు

నూజివీడు: తమది సంక్షేమ ప్రభుత్వం, మంచి ప్రభుత్వం అంటూ బాకాలు ఊదుకుంటున్న పాలకులు దివ్యాంగుల పింఛన్లలో కోత పెట్టారు. చెప్పేదొకటి చేసేదొకటి అన్న చందంగా కూటమి ప్రభుత్వం ఉన్న పింఛన్లను తొలగించేందుకు ఎత్తుగడ వేస్తోంది. దీనిలో భాగంగా పింఛన్ల రీ వెరిఫికేషన్ పేరుతో పింఛన్లు తీసుకుంటున్న దివ్యాంగులను గత ఏడాది కాలంగా ఆస్పత్రుల చుట్టూ తిప్పి పరీక్షలు చేసి ఇప్పుడు పింఛన్ల సంఖ్యను పెద్దఎత్తున తగ్గించేసింది. దీనిలో భాగంగా మీకు 40 శాతం కంటే తక్కువ వికలత్వం ఉన్నందున మీరు తీసుకుంటున్న వికలాంగ పింఛన్‌ను రద్దు చేస్తున్నామంటూ గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దివ్యాంగులకు నోటీసులు అందజేసింది. దీంతో వారంతా తమ పింఛను పోతుందేమోనని ఆందోళనకు గురవుతున్నారు. తమ గోడును వెళ్లబుచ్చుకునేందుకు లబ్ధిదారులు ఆయా మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

దివ్యాంగులకు నోటీసులు

40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉందంటూ రద్దు దివ్యాంగుల పింఛన్లను చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. దీనిలో భాగంగా నూజివీడు నియోజకవర్గ వ్యాప్తంగా 811 మంది దివ్యాంగులకు నోటీసులు ఇచ్చి వారి పింఛన్లకు కోత పెట్టేసింది. దీంతో లబ్ధిదారుల్లో తీవ్ర అలజడి మొదలై ఎంపీడీఓ కార్యాలయాల వద్ద పడిగాపులు పడుతున్నారు. వచ్చే నెలలో తమకు పింఛను వస్తుందో, రాదోనని ఆందోళన చెందుతున్నారు.

మండలాల వారీగా రద్దయిన దివ్యాంగుల పింఛన్లు

నూజివీడు	237
ఆగిరిపల్లి	350
ముసునూరు	123
నూజివీడు టౌన్	58
చాట్రాయి	43
మొత్తం	811

దివ్యాంగులు అనే కనికరం లేకుండా..

దివ్యాంగులనే కనికరం కూడా లేకుండా కూటమి ప్రభుత్వం ఇంత దారుణంగా వ్యవహరించడంపై లబ్ధిదారుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. గతంలో తాము సదరం సర్టిఫికెట్ ద్వారా పింఛన్లను పొందామని, ఇప్పుడు తమ పింఛన్లను రద్దు చేయడమేమిటని బాధితులు వాపోతున్నారు. వెరిఫికేషన్ చేసిన వైద్యులు తమను సరిగా చూడను కూడా చూడలేదని, ఆస్పత్రుల చుట్టూ, ఆఫీసుల చుట్టూ తిప్పి పింఛన్‌ను తొలగించడం దారుణమని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఒక చెయ్యి లేకపోయినా పింఛన్ తొలగించారు



విద్యుత్ షాక్‌తో తనకు కుడిచేయి భుజం వరకు తొలగించారు. దీంతో తనకు 85 శాతం వికలత్వంతో పింఛన్‌ను గతం నుంచి ఇస్తున్నారు. ఇప్పుడు వెరిఫికేషన్‌లో 40 శాతం తక్కువ ఉందని, నీకు పింఛన్‌ను రద్దు చేశారని పేర్కొంటూ గ్రామ సచివాలయ సిబ్బంది నోటీసు ఇచ్చారు. పింఛన్‌ను రద్దు చేయడం దారుణం.

– తొమ్మండ్రు రామకృష్ణ, దేవరగుంట, నూజివీడు మండలం

నాలుగేళ్ల నుంచి పింఛన్ తీసుకుంటున్నా



నాకు ఎడమ కన్ను కనబడదు. దీంతో నాలుగేళ్ల క్రితం పింఛన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. రీ వెరిఫికేషన్ అంటూ నాలుగు నెలల క్రితం ప్రభుత్వ ఆస్పత్రికి పిలిపించి చూసి పంపారు. ఇప్పుడు సచివాలయం నుంచి సెక్రటరీ వచ్చి పింఛన్‌ను తొలగించారంటూ నోటీసు ఇచ్చారు. ఇంత దారుణం మరెక్కడా ఉండదు.

– నీలగిరి కృష్ణమాచారి, జంగంగూడెం, నూజివీడు మండలం

ఇదెక్కడి దారుణం



నేను 19 ఏళ్ల నుంచి దివ్యాంగ పింఛన్ తీసుకుంటున్నా. విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ఇచ్చిన సర్టిఫికెట్ ఆధారంగానే పింఛన్‌ను మంజూరు చేశారు. పింఛన్ మంజూరైనప్పుడు రూ.500 వచ్చేది. ఇప్పుడు నీకు 40 శాతం కంటే తక్కువ వికలత్వం ఉందని, పింఛన్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని చెప్పి నోటీసు వచ్చింది. ఇదెక్కడి దారుణమో అర్థం కావడం లేదు.

– రామకూరి ఆశీర్వాదం, బోర్వంచ, నూజివీడు మండలం.

పత్తిలో తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి


చెవుటూరులో పత్తిపైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జి.కొండూరు: పత్తిని ఆశించే పురుగులు, తెగుళ్లపై రైతులు అప్రమత్తత వహించకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని గుంటూరు లాం ఫారం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.రాజమణి, వి.మనోజ్‌కుమార్, ఎల్.రాజేష్ చౌదరి అన్నారు. జి.కొండూరు మండల పరిధి వెంకటాపురం, చెవుటూరు, మైలవరం మండల పరిధిలోని చంద్రగూడెం గ్రామాలలోని పత్తిపైరును శాస్త్రవేత్తల బృందం బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం పత్తిలో కొమ్మపుచ్చు పురుగు ఎక్కువగా ఉన్నందున నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు, క్లోరోఫైరిపాస్ 20 ఈసీ 2.5 ఎంఎల్ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రసం పీల్చే పురుగుల నివారణకు పిచికారీ చేయాల్సిన మందులు, గులాబీరంగు పురుగు నివారణకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు.

పత్తిపంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు..

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో ఇటీవల భారీ వర్షాలకు దెబ్బతిన్న పత్తిపంటలను గుంటూరు లాంఫారం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. ఎ.కొండూరు, గంపలగూడెం, తిరువూరు మండలాల్లోని పలు గ్రామాల్లో పత్తిపంటలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. పత్తిచేలో చేరిన అధిక నీటిని బయటకు పంపి త్వరగా భూమి తేమ లేకుండా చేసుకోవాలని, ఎకరాకు 30 కిలోల యూరియాతో పాటు 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను అదనంగా వేయాలని రైతులకు శాస్త్రవేత్తలు సూచించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజమణి, వ్యవసాయ శాస్త్రవేత్తలు మనోజ్‌కుమార్, రాజేష్ చౌదరి, తిరువూరు ఏడీఏ రంగారావు, వ్యవసాయాధికారులు పద్మ, హరీష్, టెక్నికల్ ఏఓ టిప్పు సుల్తాన్, ఏఈఓలు పాల్గొన్నారు.

సక్రమంగా విధుల నిర్వహణ

అధికారులకు సబ్ కలెక్టర్ వినూత్న ఆదేశం


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వినూత్న

చాట్రాయి: మండల స్థాయి అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సబ్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో మందుల కొరత, జ్వరాలపై పీహెచ్‌సీ డాక్టర్ శ్రీనివాసరెడ్డిని అడగ్గా మందుల కొరతలేదని చెప్పారు. ఏఏ పంటలు ఎంతెంత సాగు చేస్తున్నారు, యూరియా సరిపడినంతా ఉందా, ఈ క్రాఫ్ ఎంత వరకు చేస్తున్నారు అని వ్యవసాయ అధికారి బి. శివశంకర్‌ని అడిగి తెలుసుకున్నారు. అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్ ప్రాసెస్ ఎలా ఉందని డెప్యూటీ తహసీల్దార్ ఈశ్వరరావుని అడగ్గా 214 దరఖాస్తుల్లో ఇంకా 50 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని చెప్పారు. మండలంలో విద్యా శాఖకు సంబంధించి ఎంఈఓ మాసగిరి శ్రీనివాస్‌ని, ఉద్యాన శాఖకు సంబంధించి ఆ శాఖ అధికారి హేమను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయం అపరిశుభ్రంగా ఉందని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

నూజివీడు: మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న అన్నారు. పర్యావరణ పరిరక్షణ ద్వారానే భవిష్యత్ తరాలు సురక్షితమైన జీవనాన్ని సాగించగలుగుతాయని చెప్పారు. పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమ్మపేరుతో మొక్కను నాటుదాం అనే కార్యక్రమాన్ని యువజన సర్వీసుల శాఖకు చెందిన మేరా యువ భారత్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్ కలెక్టర్ మాట్లాడుతూ చెట్లను మనం రక్షించుకుంటే అవి మనల్ని రక్షిస్తాయన్నారు.

పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా చెట్లు కాపాడతాయని చెప్పారు. వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ శాతం పెరగకుండా చెట్లు చూసుకుంటాయని చెట్ల సంఖ్య తగ్గిపోతే వాతావరణంలో భూతాపం పెరిగిపోయి అనేక దుష్ఫలితాలు ఏర్పడతాయన్నారు. పారిశ్రామిక వృద్ధి, విపరీతంగా పెరిగిపోతున్న వాహనాల వల్ల వాతావరణంలోకి కాలుష్య కారకాలు విచ్చలవిడిగా విడుదలవుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లోనే ప్రకృతి విపత్తులు సంభవిస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అనంతరం సబ్ కలెక్టర్ మొక్కలను నాటారు. ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్, తహసీల్దార్ గుగులోతు బద్రూనాయక్, కళాశాల ప్రిన్సిపాల్ పాతూరి తేజేంద్ర, వీఆర్వోలు ప్రియాంక, ఉషారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరిలో సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు

ఏఓ రజని


రైతులతో మాట్లాడుతున్న ఏఓ రజని

ఈలప్రోలు(ఇబ్రహీంపట్నం): వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి రజని అన్నారు. గుంటుపల్లి, ఈలప్రోలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతుల పొలాలను క్షేత్రస్థాయిలో సందర్శించి పొలాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. పొలాలను పరిశీలించిన అనంతరం గ్రామ సచివాలయం వద్ద రైతులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు నాట్లు వేసిన మొదలు పంట నూర్పిడి వరకు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని చెప్పారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని, తద్వారా పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడి సాధించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. రైతులు పాల్గొన్నారు.

ఢిల్లీ బృందం పర్యటన

విస్సన్నపేట: విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాల్లో ఢిల్లీ బృంద సభ్యులు బుధవారం పర్యటించారు. వివిధ లోన్స్ తీసుకుని చిరు వ్యాపారాలు చేస్తున్న మహిళలతో స్థానిక వెలుగు కార్యాలయంలో వారు సమావేశం అయ్యారు. వివరాలు తెలుసుకుని వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఎంఓ ద్వారా ఢిల్లీ నుండి వచ్చిన ప్రతినిధులు రబ్బానీ, పర్వీనా, సెర్ప్ ప్రతినిధులు భారతి, పావనజ్యోతి, శోభారాణి, విన్సెంట్ కుమార్, జిల్లా ఎల్‌హెచ్ డీపీఎం శ్రీనివాసరావు, ఎంఎస్ ప్రెసిడెంట్ ఎన్. నాగమణి,ఏపీఎంలు పాల్గొన్నారు.

నిలకడగా వరద ప్రవాహం


ఫెర్రీ వద్ద నదిలో వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

ఇబ్రహీంపట్నం: ఎగువన పులిచింతల ప్రాజెక్ట్ నుంచి దిగువకు విడుదల చేసిన నీటితో కృష్ణానదిలో వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. రెండు రోజులుగా 4 లక్షలకు పైగా నదిలోకి వరదనీరు చేరడంతో నదీతీర ప్రాంత గ్రామాల ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు బుధవారం నదీతీర ప్రాంత గ్రామాల్లో పర్యటించి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఫెర్రీ లాంచీ రేవు వద్ద ఎప్పటికప్పుడు వరద ఉధృతిని పరిశీలిస్తున్నారు. నదిలోకి ఎవరూ దిగకుండా రెవెన్యూ, ఎన్డీఆర్ఎఫ్, పోలీస్ సిబ్బంది పహారా కాస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 4.63 లక్షల క్యూసెక్కుల వరద నదిలో కొనసాగుతుందన్నారు. శ్రీశైలం నుంచి మరో 5.20 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల అవుతున్నందున నదిలో 6 లక్షల క్యూసెక్కుల వరకు వరద చేరే అవకాశం ఉందని చెప్పారు. జాలర్లు పడవల ద్వారా నదిలోకి దిగొద్దని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వివిధ ట్రేడులలో సీట్ల భర్తీకి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని కళాశాల ప్రధానాధికారి పి. రజిత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నా. ఈనెల 21 నుంచి 26 సాయంత్రం 5 గంటల వరకు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ప్రింట్‌ను తీసుకొని వచ్చి కళాశాలలో ఈనెల 27న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని చెప్పారు. 29న ఉదయం 9 నుంచి ఐటీఐ కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా


ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏజెంట్లు

తిరువూరు: తమ న్యాయమైన కోర్కెలను ఆమోదించడంలో భారతీయ జీవిత బీమా సంస్థ అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా తిరువూరు శాటిలైట్ బ్రాంచి ఎదుట ఎల్ఐసీ ఏజెంట్లు బుధవారం ధర్నా నిర్వహించారు. గ్రూప్ ఇన్సూరెన్సు పాలసీ రూ.25 లక్షలకు పెంచాలని, వయసు 69 నుంచి 85 సంవత్సరాలకు పెంచాలని, మెడిక్లెయిం అందరు ఏజెంట్లకు వర్తింపజేయాలని, ఏజెంట్లకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసీ ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా తిరువూరు యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు గూడెల్లి రాఘవరావు, పామర్తి అంకులు, కోశాధికారి నాగమణి, రాష్ట్ర కోశాధికారి పంతంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

తిరువూరు: గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఈ నెల 22న చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ సంధ్య తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించే ఈ వ్రతాలలో పాల్గొనే మహిళలు రుసుం చెల్లించనవసరం లేదని, పూజా ద్రవ్యాలు తెచ్చుకోవాలన్నారు.

త్రిసభ్య కమిటీ బాధ్యతల స్వీకారం

జి.కొండూరు: మండల పరిధి చెవుటూరు పీఏసీఎస్ చైర్మన్‌గా ఈమని మురళీకృష్ణ, సభ్యులుగా ప్రత్తిపాటి యేసయ్య, కోలా వెంకట నారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ త్రిసభ్య కమిటీని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన సుందరాకాండ సప్తాహం

తిరువూరు: శ్రావణ మాస సందర్భంగా స్థానిక పాటిమీద దాసాంజనేయస్వామి దేవస్థానంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న సుందరాకాండ పారాయణ సప్తాహ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. సుందరాకాండలోని భాగాలను స్థానాచార్యులు విశలాచార్యులు సోదాహరణగా వివరించారు. ఆలయ ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మండల పరిధి హెచ్.ముత్యాలంపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో అంతర్గత రహదారి అభివృద్ధికి నోచుకోక స్థానికులు నరకయాతన పడుతున్నారు. ఇక్కడ రహదారి గత కొన్నేళ్లుగా వివాదంలో ఉండడంతో అభివృద్ధి చేసేందుకు అధికారులు ఎటువంటి ప్రయత్నాలు చేయడంలేదు. దీనితో వర్షం నీటితో పాటు మురుగునీరు సైతం రహదారిపై చేరుతోంది. రహదారికి ఇరువైపులా పదుల సంఖ్యలో నివాసాలు ఉన్నప్పటికీ వివాదం పరిష్కరించడంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలం చెందారు. అధికారులు స్పందించి రహదారి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

–జి.కొండూరు

కొండపల్లిలో సీఐటీయూ జిల్లా మహాసభలు

ఇబ్రహీంపట్నం: కొండపల్లిలో సెప్టెంబర్ 13, 14 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ కోరారు. ఇబ్రహీంపట్నంలో బుధవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల ఐక్య పోరాటాతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. ప్రభుత్వాలు సంస్కరణల పేరుతో ప్రజలను దోచుకునే తీరుపై సీఐటీయూ ప్రజలను చైతన్య వంతులను చేస్తుందని చెప్పారు. మహాసభ విజయవంతానికి 17మందితో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు విఠల్‌రావు, మండల కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

ఆగిరిపల్లి: ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జై భవాని అన్నారు. నరసింగపాలెం, కృష్ణవరం, అడవినెక్కలం, ఈదర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఎరువుల అమ్మకాలను, రికార్డులను బుధవారం తనిఖీ చేశారు. సహకార సంఘాల కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తహసీల్దార్ జె. సుశీలాదేవి

మైలవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ గ్రామంలో లోతట్టు ప్రాంతాలను రెవెన్యూ సిబ్బంది, అధికారులతో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. గ్రామంలోని ఇళ్ల వద్ద నిల్వ ఉన్న వర్షం నీటిని పంచాయతీ సిబ్బందితో డ్రెయినేజీ కాలువల ద్వారా పంపించి, బ్లీచింగ్ చల్లించారు. రుద్రవరం గ్రామంలో 15, 25 నంబర్లు గల రేషన్ షాపులను తనిఖీ చేశారు. నరుకుళ్లపాడు, కుదప, కూనపురాజుపర్వ గ్రామాల్లోని వాగులు, చెరువులు, ఎస్ఎస్‌పీ కాలువలను రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు పంటల సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి గంధం పుల్లయ్య, రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖల అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగ నైపుణ్యాలపై అవగాహన

మైలవరం: బీబీఏ విద్యార్థులు లాజిస్టిక్స్‌లో కెరీర్ నిర్మాణం, ఉద్యోగ నైపుణ్యాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ ఇండస్ట్రీ ప్రొఫెషనల్, వాణిజ్య వేజర్ అంతర్జాతీయ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ వి. ప్రమోద్ నాయర్ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం బీబీఏ లాజిస్టిక్స్ విద్యార్థులకు స్పెషల్ ఆన్‌లైన్ లెక్చర్ లాజిస్టిక్స్‌లో కెరీర్ నిర్మాణం, ఉద్యోగ నైపుణ్యాలు అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రమోద్ నాయర్ మాట్లాడుతూ 1990 నుంచి 2025 మధ్య లాజిస్టిక్స్‌లో వస్తున్న మార్పులను అనుసరించి విద్యార్థులు కెరీర్‌ను ఎలా తీర్చిదిద్దుకోవాలో వివరించారు. కామర్స్ విభాగం నుంచి శ్రీనివాసరావు, సీనియర్ అధ్యాపకులు జి. నారాయణరావు, కె. శ్యాం సుందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఫ్ఏ 1 పరీక్షల తనిఖీ

ముసునూరు: విద్యార్థులు పరీక్షలను సమగ్రంగా రాసే విధానాన్ని అలవాటు చేయాలని ఎంఈఓ-2 బీవీఎస్ సుబ్బారావు సూచించారు. మండలంలోని గోపవరం మెయిన్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ-1) పరీక్షలను బుధవారం ఆయన తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. హెచ్ఎం కె.నాగేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

ముసునూరు: పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆలూరి చాముండేశ్వరి రైతులకు సూచించారు. చెక్కపల్లి, చింతలవల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



నూజివీడు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణంలోని కోనేరుపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయిసుధ సూచించారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని కోనేరుపేటలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాల్లో చెత్తచెదారం, మురుగునీటి గుంతలు లేకుండా చూసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడిగా ఉన్న ఆహార పదార్థాలను భుజించాలని, నిద్రించేటప్పుడు దోమ తెరలను ఉపయోగించాలని సూచించారు. మలేరియా యూనిట్ అధికారి యలమంద, హెచ్‌వీ కుమారి, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

జి.కొండూరు: సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ చేతుల మీదుగా లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జి.కొండూరు మండల పరిధిలో 37 మందికి రూ.18.89 లక్షల విలువ గల చెక్కులను అందజేశామని చెప్పారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



పుట్రేల(విస్సన్నపేట): పుట్రేల సొసైటీ మాజీ అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు భీమిరెడ్డి సూర్యనారాయణరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి కుమారుడు భీమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డిని, కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు బుధవారం పరామర్శించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఓలేటి దుర్గారావు, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, గ్రామ ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

నిమ్రాలో ఏఆర్టీ వైద్య సేవలు

జూపూడి(ఇబ్రహీంపట్నం): ఏపీశాక్స్ ఆధ్వర్యంలో స్థానిక నిమ్రా వైద్యశాలలో ఏఆర్టీ వైద్య సేవలు ప్రారంభించామని నిమ్రా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శ్యామల, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.శివరంజన్, పాత ప్రభుత్వ వైద్యశాల ఏఆర్టీ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ గౌతం అంబేడ్కర్ తెలిపారు. ఇబ్రహీంపట్నం నిమ్రా వైద్య కళాశాలలో బుధవారం ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏఆర్టీ వైద్య సేవలు ప్రారంభించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతవాసులు ఏఆర్టీ చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాల్సి వచ్చేదని చెప్పారు. ఇప్పటి నుంచి హెచ్‌ఐవీ, ఎయిడ్స్ సోకిన వారు ఇక్కడ ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో షేర్ ఇండియా ప్రతినిధి జాన్‌వెస్లీ, ఏఆర్టీ సెంటర్ కౌన్సిలర్ కె.వరప్రసాద్, డాటా మేనేజర్ బత్తుల విజయ పాల్గొన్నారు.

7 నుంచి యోగా పోటీలు

ఆగిరిపల్లి: జిల్లా స్థాయి యోగాసన పోటీలు సెప్టెంబర్ 7 నుంచి స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ప్రాంగణంలో జరుగుతాయని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు యండూరు నరసింహమూర్తి, కార్యదర్శి బొద్దూరు సాంబశివరావు, తెలిపారు. 8 నుంచి నుండి 60 సంవత్సరాల వయస్సు గల పురుషులు, మహిళలు పాల్గొనవచ్చునన్నారు. పూర్తి వివరాలకు సెల్:94903 35122, 91334 02255 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నారాయణ స్కూల్ వద్ద తల్లిదండ్రుల ధర్నా

మైలవరం: మైలవరం నారాయణ స్కూల్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తల్లికి వందనం డబ్బులు రాలేదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. దీనిపై గతంలో కూడా పలు దఫాలుగా ఆందోళన కార్యక్రమం చేపట్టడంతో పాఠశాల ఏజీఎం, జీఎంలు అర్హులందరికీ తల్లికి వందనం పడే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనివ్వడంతో అప్పట్లో ఆందోళన విరమించారు. స్కూల్ యాజమాన్యం ఇచ్చిన గడువు దాటినా తల్లికి వందనం డబ్బులు పడకపోవడంతో బుధవారం తిరిగి తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. స్కూల్ ప్రతినిధులు హరీష్ బసవరాజు, ఎంఈఓ బాలు విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చలు జరిపారు. ఈ నెల 25లోగా అర్హులందరికీ తల్లికి వందనం డబ్బులు పడకపోతే ఆ మొత్తాన్ని పాఠశాలకు చెల్లించే ఫీజులో మినహాయించుకోవాలని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మహిళ అనుమానాస్పద మృతి

మైలవరం: మైలవరం మండలం బాడవ గ్రామంలో బుధవారం ఓ మహిళ అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. మైలవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాడవ గ్రామానికి చెందిన గర్నేపూడి మహాలక్ష్మి (55) తన ఇంటి బాత్‌రూంలో కాలు జారి పడి తలకు గాయం కావడంతో మృతిచెందింది. మృతురాలికి భర్త సత్యనారాయణ, కుమారుడు గర్నేపూడి రవి, కుమార్తె యడ్ల పద్మావతి ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.